క్లుప్తంగా

తూకాల్లో మోసాలు చేస్తే కఠిన చర్యలు



సత్తెనపల్లి: తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు హెచ్చరించారు. పట్టణంలోని పలు చికెన్, మటన్, చేపల దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తూ కేజీకి 100 గ్రాముల నుంచి 250 గ్రాములు తక్కువ తూయడాన్ని గమనించారు. మొత్తం 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఇకపై ఎలాంటి మోసాలు చేసినా.. చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు ఒకటికి రెండు సార్లు చూసుకొని కాటాలను గమనించాలన్నారు. ఆయన తోపాటు సిబ్బంది ఉన్నారు.

'స్నేహ హస్తాలు' ఆర్థిక సాయం



అచ్చంపేట: పెదపాలెం గ్రామానికి చెందిన దంతాల నాగరాజుక పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. దీంతో స్నేహ హస్తాలు సంస్థ సభ్యులు స్పందించి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.75వేలు విలువచేసే ఇటుకలు, ఇనుము, సిమెంట్, సిమెంట్ పోల్స్ తదితర సామగ్రిని ఆదివారం బాధితుడికి అందించారు. గ్రామ పెద్దల సమక్షంలో శంకుస్థాపన చేయించారు. కుటుంబ నిత్యావసరాలకు మరో రూ.25వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మన్నెం భద్రయ్య, సంస్థ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా, గ్రామ మాజీ సర్పంచ్ నెల్లూరి వెంకటయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ చిరుమామిళ్ల నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు



అచ్చంపేట: ట్రాక్టరు బైక్‌ను ఢీకొట్టడంతో విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన సంద్ర తండా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మేడికొండూరుకు సమీపంలోని కేసీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న రాజశేఖర్ మరో ఇద్దరు విద్యార్థులు బైకుపై పులిచింతల ప్రాజెక్టును సందర్శించేందుకు వేగంగా వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొట్టగా విద్యార్థులు కింద పడిపోయారు. బైకు ట్రాక్టరు క్రిందకు దూసుకుపోయింది. తీవ్ర గాయపడిన విద్యార్థులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాజశేఖర్ ఎడమకాలు తీవ్రంగా గాయం కాగా మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

సత్తెనపల్లి రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



సత్తెనపల్లి: సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మీసాల రాంబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన సత్తెనపల్లికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన ప్రేమయ్య వీఆర్‌కు వెళ్లారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి రూరల్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాంబాబు సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

చేజర్లలో ఉచిత కంటి వైద్య శిబిరం



నకరికల్లు : చేజర్ల గ్రామంలో ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజన్ సెంటర్ కో–ఆర్డినేటర్ బత్తుల మల్లేష్ మాట్లాడుతూ శిబిరంలో 108 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడంతో పాటు కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్ఎంపీ వైద్యులు రాజేంద్ర ప్రసాద్, మాణిక్యారావు, టెక్నీషియన్‌లు శ్యామ్, సిద్ధార్థ , బాలకృష్ణ , రత్నాకర్, హరీష్ బాబు, దూళిపాళ్ల హాస్పిటల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాధ్యమైందిగా..

- సచివాలయ వ్యవస్థతో మారిన పల్లె స్వరూపం
- సత్వర సేవలు, శాశ్వత భవనాలు
- అచ్చంపేట మండలంలో 7 భవనాల్లో సచివాలయ సేవలు
- ప్రారంభానికి సిద్ధంగా మరో నాలుగు, నిర్మాణ దశలో ఆరు భవనాలు



కోగంటివారిపాలెంలోని గ్రామ సచివాలయ భవనం

అచ్చంపేట: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయాల ద్వారా అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వ పరిపాలనా విధానంలో వినూత్న మార్పులు చేశారు. ఏ ఒక్కరూ పనులు మానుకుని గ్రామాలను వదిలి మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పనిలేకుండా రెండు, మూడు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున మండలంలో 17 సచివాలయాలను తాత్కాలికంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 27 గ్రామాలు, మూడు గిరిజన తండాలున్నాయి. పంచాయతీ భవనాలలో సచివాలయాలు ఏర్పాటవడంతో కొత్తగా నియమించిన వివిధ శాఖల సిబ్బందికి తగినన్ని గదులు లేకపోవడంతో నూతనంగా సచివాలయాలను నిర్మించేందుకు 0.20 సెంట్లు స్థలాన్ని సేకరించి, అందులో భవన నిర్మాణానికి రూ.40లక్షల నిధులు మంజూరు చేశారు.

7 శాశ్వత భవనాలు..

మొత్తం 17 సచివాలయాలలో 7 భవనాలు పూర్తి అయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వాటిని ప్రారంభించారు. కోగంటివారిపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, పెదపాలెం, చల్లగరిగ, కస్తల, కొండూరు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు పూర్తయ్యాయి. మాదిపాడు, కొత్తపల్లి, తాడువాయి, రుద్రవరం, చిగురుపాడు, కోనూరు గ్రామాలలో నిర్మాణ దశలో ఉన్నాయి. అచ్చంపేట–1, అచ్చంపేట–2, గ్రంథశిరి, వేల్పూరు గ్రామాలలో స్థల సేకరణ పూర్తికాగా భవనాలను నిర్మించాల్సి ఉంది.



ప్రతి సచివాలయంలో 12 మంది

సచివాలయానికి 12 మంది సిబ్బంది చొప్పున మండలంలో 204 మందిని నియమించారు. ఆన్‌లైన్ ద్వారా గ్రామస్తులకు సేవలు అందించేందుకు డిజిటల్ అసిస్టెంట్.. రైతులకు కావాల్సిన పత్రాలను అందించేందుకు రెవెన్యూ అసిస్టెంట్, రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అగ్రికల్చరల్ అసిస్టెంట్, మహిళలకు రక్షణ కల్పించి దిశ చట్టాన్ని సజావుగా నిర్వహించేందుకు మహిళా పోలీస్, ఆరోగ్య సంబంధిత సమస్యల పరిష్కారానికి ఒక ఏఎన్ఎం, మత్స్యకారులకు సలహాలనిచ్చేందుకు ఫిషరీస్ అసిస్టెంట్, పశుసంవర్ధక అసిస్టెంట్, గ్రామ పంచాయతీకి సంబంధించి పంచాయతీ అసిస్టెంట్, పొలం కొలతల కోసం విలేజ్ సర్వేయర్, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేసేందుకు వెల్ఫేర్ అసిస్టెంట్, పంట తోటలపై అవగాహన కల్పించేందుకు హార్టీ కల్చరల్ అసిస్టెంట్, ఒక ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నియమించారు. వీరి ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన పనులు సచివాలయాల ద్వారానే గ్రామస్తులకు అందుతున్నాయి.

సక్రమంగా ప్రభుత్వ సేవలు



గతంలో ఏ చిన్న పనిపడినా.. మండలాలాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడం ద్వారానే నా భార్య పేరుపై సెంటున్నర స్థలం ఇచ్చి, ఇల్లు కూడా మంజూరు చేశారు. మేము ఇల్లు కూడా నిర్మించుకుని నివాసం ఉంటున్నాం.

– బాసిపోగు కోటయ్య, మాదిపాడు

అన్ని రకాల సేవలు అందుతున్నాయి.



సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్తులంతా గ్రామాల్లో ప్రభుత్వ సేవలను అందుకోగలుగుతున్నారు. అన్ని శాఖలకు సంబంధించి సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేదు. ఎవరికి రూపాయి లంచం ఇచ్చే పనిలేకుండా సచివాలయాల్లోనే చేసి పెడుతున్నారు.

– భూక్యా కృష్ణా నాయక్, తాడువాయి

ముస్లిం సోదరులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ముస్లిం సోదరులకు తాను ఎల్లప్పుడు అండా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డిని, తనను మరోకసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం క్రోసూరులోని జగనన్న కాలనీలో నిర్మించిన మసీదు ప్రారంబోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పేదలకు సొంతింటి కల తీర్చటంతో పాటు మౌలిక వసతులు పూర్తిగా కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించటం జరిగిందన్నారు. క్రోసూరు జగనన్న కాలనీలో 650 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే వాటిలో 180 మంది ముస్లిం సోదరులున్నారని చెప్పారు. వారు పార్థనలు చేసుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి, మసీదు నిర్మించటం జరిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ముస్లిం సోదరులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో షాదీ ఖానాలు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, నామినేటెడ్ పోస్టుల్లో ముస్లిం సోదరులకు సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. అనంతరం జగనన్న కాలనీ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం ఇప్పించాలని వినతి

జగనన్న కాలనీ ముస్లిం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిక కాలనీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని స్థానిక ముస్లింలు ఎమ్మెల్యే నంబూరు దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి, న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలో రూ. 2.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే శంకరరావు పంపిణీ చేశారు. దొడ్లేరు గ్రామానికి చెందిన దేశ గురులక్ష్మీకి రూ.లక్ష, క్రోసూరు కు చెందిన ఆంజనేయశాస్త్రికి రూ.60 వేలు, 88త్యాళ్లూరుకు చెందిన రాయపాటి భరత్‌కు రూ.60 వేలు చెక్కులను అందజేశారు.

జగనన్న పాలన సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనం

మండలంలోని ఊటుకూరు సచివాలయం, పీసపాడులో సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే భవనాలు ఎమ్మెల్యే నంబూరు ప్రారంభించారు. గుడిపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం ప్రారంభించి, మాట్లాడారు. కలిసికట్టుగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అమరావతి– బెల్లంకొండ రోడ్డు శరవేగంతో పూర్తిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈరోడ్డు వల్ల అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా పులిచింతల బ్యాక్‌వాటర్ వినియోగించుకునేందుకు నాగిరెడ్డిపాలెం చెరువుకు నీళ్ల రప్పించి క్రోసూరు, అచ్చంపేట రైతులకు, ప్రజలకు సాగు నీటి, తాగునీటి కష్టాలు తీర్చటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గుర్రంపై గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా వైద్యులకు సత్కారం



వైద్యులు డాక్టర్ గిరిజకు సత్కారం

సత్తెనపల్లి: వైద్యులు దైవ సమానులు అని సత్తెనపల్లి ప్రైవేట్ హస్పిటల్స్ కాంపౌడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం.రఫీ అన్నారు. జాతీయ మహిళా డాక్టర్ల దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరుగురు మహిళా డాక్టర్లను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ఎన్నో రుగ్మతలతో వచ్చే రోగులను కాపాడే వైద్యులు దైవంతో సమానమన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు మాట్లడుతూ కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ అన్ని వేళల్లో రోగుల కోసం పని చేస్తున్న మహిళా డాక్టర్లు అభినందనీయులన్నారు. గ్రామీణ ప్రాంత రోగులకు సేవలందించటంలో సత్తెనపల్లి మహిళా వైద్యులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సీనియర్ వైద్యులు అయిన డాక్టర్ జి.గిరిజ, డాక్టర్ పోట్ల అరుణకుమారి, డాక్టర్ షకీలా శ్రీధర్, డాక్టర్ ఫణి ప్రశాంతి, డాక్టర్ గీతా హసంతీ, డాక్టర్ ఈట రాజశ్రీలను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వలి, శ్రీనివాస్, ఏసు, రంజిత, ప్రసన్న తది తరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శం



మెల్విన్ జోన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ గవర్నర్ కృపానందం, క్లబ్ బాధ్యులు

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ సేవలు మరిన్ని స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకం కావాలని లయన్స్ క్లబ్ గవర్నర్ మేళం కృపానందం అన్నారు. లయన్స్ సోషల్ మీట్, ఛార్టర్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జోన్ చైర్మన్ తోట చినసాంబశివరావు అధ్యక్షత వహించారు. కృపానందం మాట్లాడుతూ క్లబ్‌లో సభ్యుల సంఖ్య పెంచడం, సేవా కార్యక్రమాలు విస్తృత పరచడం సభ్యులందరూ బాధ్యతగా భావించాలన్నారు. పూర్వ గవర్నర్ విజయకుమారరెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి క్లబ్ గత 40 సంవత్సరాలుగా అన్నింటా ముందంజలో ఉందని కొనియాడారు. ఉత్తమ సేవలందించిన క్లబ్‌లకు, సభ్యులకు అవార్డులు ప్రదానం చేశారు. హోస్ట్‌గా సత్తెనపల్లి క్లబ్ వ్యవహరించింది. ఈ సందర్భంగా 20 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ సభ్యులు కంభాల వెంకటేశ్వరరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, వైపీ మురళీకృష్ణ, తవిటి భావన్నారాయణ, కంకణాల విష్ణువర్ధన్‌రావు, తిరుమల సాంబశివరావు, తోట పద్మ, సభ్యులు పాల్గొన్నారు.

పేదల పక్షపాత ప్రభుత్వానికి అండగా నిలవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాచాయపాలెం సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. ఆదివారం మండలంలోని వన్నాయపాలెం, మాచాయపాలెం, పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో రూ.5.45కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా వన్నాయపాలెం గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. మాచాయపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మాచాయపాలెంలో రూ.29 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.22లక్షలతో ఆర్బీకే, రూ.23 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.35లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ' సిద్ధం' అంటూ గ్రామ యువకుల ఏర్పాటు చేసిన చిత్రం వద్ద ఎమ్మెల్యే ఎన్నికల రణరంగానికి సిద్ధం అంటూ యువకులను ఉత్సాహపరిచారు. గ్రామంలో ఈ నాలుగు భవనాలను నిర్మించిన బద్దూరి శేషిరెడ్డిని, స్థల దాత చన్నపరెడ్డి వెంకటరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం పాపాయపాలెం గ్రామంలో రూ.1.35 కోట్లతో నిర్మించిన జెడ్పీ పాఠశాల భవనాలు, రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21లక్షలతో ఆర్బీకే, రూ.25లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో రూ.44 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.22 లక్షలతో హెల్త్‌క్లినిక్, రూ.26లక్షలతో ఆర్బీకే, రూ.10లక్షలతో పాఠశాల ప్రహరీ, రూ.16లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, ఎంపీడీవో వెంకటరెడ్డి, ఏఈ పాపారావు, చింతారెడ్డి సాయిరెడ్డి, ప్రసాదరెడ్డి, భద్రయ్య, మేకల సోమయ్య సర్పంచ్‌లు మేకల త్రివేణి, రామనబోయిన ఆదిగోపాలరావు, చిమటా మాధవి సైదయ్య, దారం వెంకటనర్సమ్మ రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, నరసింహానాయక్, మారెళ్ల సాంబశివారెడ్డి, తురకాశ్రీను, బ్రహ్మం, ప్రకాష్, ఎంపీటీసీలు, మర్రి శ్రీనివాసరెడ్డి, నరసింహానాయక్, రేగులగడ్డ శ్రీను, అక్కల వెంకట్రామిరెడ్డి, మర్రి పెదబ్రహ్మరెడ్డి, చిన బ్రహ్మరెడ్డి, పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, మర్రి రామిరెడ్డి, మేకల వెంకటేశ్వర్లు, వజ్రాల శ్రీనివాసరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకోటినాయక్, మాటూరి చిట్టిబాబు, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డపల్లి రాము వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో ప్రతిభ



సత్తెనపల్లి: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి కరకట్ట ఉండవల్లి సమీపంలోని లైలాగంగరాజు నగర్ లో ఆదివారం నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాస్ ఈత పోటీల్లో సత్తెనపల్లికి చెందిన నిమ్మగడ్డ హనుమంతురావు ప్రతిభ కనబరిచారు. 61 సంవత్సరాల విభాగంలో 1.5 కిలో మీటర్ల ఈత పోటీల్లో 48 మంది పోటీపడగా సత్తెనపల్లికి చెందిన హనుమంతరావు ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 40నుంచి50 సంవత్సరాల విభాగంలో 1.5 కిలోమీటర్లు నిర్వహించిన ఈత పోటీల్లో 86 మంది పాల్గొనగా సత్తెనపల్లికి చెందిన షేక్ మహమ్మద్ గని, డాక్టర్ జి శ్రీధర్, షేక్ మహబూబ్ సైదాలు నిర్ణీత సమయానికి చేరుకొని ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్స్, మెడల్స్ అందుకున్నారు. ఈత పోటీల్లో ప్రతిభ చూపిన వారిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

రెండో పీహెచ్‌సీకి అనుమతులు

అచ్చంపేట: మండలంలో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ నుంచి అనుమతులు వెలువడినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. విస్తీర్ణ పరంగా పెద్ద మండలం కావడంతో... 23 గ్రామ పంచాయతీలకు వైద్య సేవలను అచ్చంపేట పీహెచ్‌సీ ద్వారా అందించడం కష్టంగా ఉండటంతో.. రెండో పీహెచ్‌సీకి ప్రతిపాదనలు పంపారు. మండలంలోని చిట్టచివరి గ్రామమైన మాదిపాడులో నిర్మించేందుకు ఉత్తర్వులు అందాయి. అయితే.. చింతపల్లిలో పీహెచ్‌సీ నిర్మిస్తే తాళ్లచెరువు నుంచి కొత్తపల్లి, చెరుకుంపాలెం, చింతపల్లి, పుట్లగూడెం, తాడువాయి, చల్లగరిగ, గింజుపల్లి, కుంటిమద్ది, మాదిపాడుతోపాటు మరో మూడు గిరిజన తండాల ప్రజలకు వైద్య సేవలు విస్తరించవచ్చని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో అధికారులు స్పందించి చింతపల్లిలో పీహెచ్‌సీని నిర్మించేందుకు అనుమతులు జారీ చేశారు. భవనానికి రెండెకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు సేకరించారని, త్వరలో నిర్మాణాన్ని చేపడతామని ఎమ్మెల్యే కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

పది కిలోల గంజాయి స్వాధీనం



నాదెండ్ల: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి కథనం.. గణపవరం చవిటిపాలెం వెళ్లే డొంక రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై పది కిలోల గంజాయి తరలిస్తుండగా ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరు ఖైరతాబాద్ చింతలబస్తీకి చెందిన కడం ఉల్లాస్, ఒడిషా రాష్ట్రానికి చెందిన గౌలరి శంకర్, విశాఖ జిల్లా సీలేరుకు చెందిన రెడ్డి గుణశేఖర్‌గా గుర్తించారు. గత నెల 31వ తేదీన చింతలపుట్టి శివకుమార్, కె.శంకర్ రెండు ద్విచక్రవాహనాలపై గంజాయిని తరలిస్తూ తిమ్మాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి పోలీసులకు చిక్కారు. ఇద్దరి వద్ద నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఇరువురు నిందితుల సమాచారం ఆధారంగా తనిఖీ నిర్వహించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన వారిలో యడ్లపాడు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్, రూరల్ ఎస్ఐ రవికృష్ణ, ఏఎస్ఐ రోశిబాబు, నాదెండ్ల డీటీ అనూరాధ, ఆర్ఐ రమీజా, వీఆర్వో వీరయ్య ఉన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్ల


శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చిలకలూరిపేట/యడ్లపాడు: గ్రామదేవత అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పురుషోత్తమపట్నంలోని అంకమ్మతల్లి ఆలయం వార్షికోత్సవానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిడిమాను ఊరేగింపును రాజేష్‌నాయుడు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు రాజేష్‌నాయుడిని పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానించారు. ఆశేష భక్తజనం నడుమ పార్టీ శ్రేణులతో కలిసి రాజేష్‌నాయుడు ఆలయ ప్రదక్షిణలు చేసి, భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం జరిగిన పూజల్లో పాల్గొని పండితుల ఆశీస్సులు అందుకున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను గ్రామస్తులతో కలసి తిలకించారు. అక్కడ నుంచి గ్రామంలోని బొడ్డురాయి, వినాయక దేవాలయం, శివాలయం, గంగమ్మ తల్లి దేవాలయాల వద్ద రాజేష్‌గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం పట్టణంలోని 13,14 వార్డుల్లో రాజేష్ నాయుడు పర్యటించారు. రానున్న ఎన్నికల్లో మాజీ కౌన్సిలర్లు వార్డుల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ



ముప్పాళ్ల: ఆరోగ్యశ్రీ, పీఎం జేఏవై కార్డులను వైద్య సిబ్బంది ఆదివారం పంపిణీ చేశారు. మండలానికి మొత్తం 8 వేల కార్డులు అందాయని, వైద్య సిబ్బంది కార్డులను పంపిణీ చేస్తున్నారని పీహెచ్‌సీ వైద్యులు వి.జయకృష్ణ తెలిపారు. తొండపి గ్రామానికి 1,132, మాదల–1కి 1,073, బొల్లవరం కి 314, చాగంటివారిపాలెం కు 817, పలుదేవర్లపాడు కు 413, ఇరుకుపాలెం కు 719, రుద్రవరం 406, మాదల–2 కు 814 ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయన్నారు. ఆ మేర వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కార్డులు అందించటం జరుగుతుందన్నారు. కార్డుల పంపిణీపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. సీహెచ్ఓ ఆంజనేయులు, సూపర్ వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొల్లాపల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మన్నేపల్లిపాడు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన మూడావత్ రామునాయక్(38) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా ప్రాంతానికి చేరుకొని పోలీసులు విచారణ చేశారు. మృతుడికి భార్య బుజ్జిబాయి, ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలతో భార్య వినుకొండ పట్టణంలో నివాసం ఉంటుంది. ఇటీవల భర్తపై వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడి తల్లి రాంకీబాయి ఫిర్యాదు మేరకు బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులు కేసు నమోదు చేశారు.

జిల్లా టైలర్స్ కార్యవర్గంలో పలువురికి స్థానం

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా టైలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం పిడుగురాళ్లలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీలో వినుకొండ నుంచి కోశాధికారిగా ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాశీ వెంకటాచారి, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే సైదాలు ప్రమాణస్వీకారం చేశారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



వినుకొండ(నూజెండ్ల): విద్యార్థులు శ్రద్ధతో చదవాలని పట్టణ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుక ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లింగారావు, బి.వరప్రసాద్, పుల్లారావు పాల్గొన్నారు.